9

సాక్షి విశాఖపట్నం

శుక్రవారం । 15 । మార్చి । 2024



ముగిసిన ఇంటర్ ఫస్టియర్ పరీక్షలు 10లో



స్ట్రాంగ్ రూం, కౌంటింగ్ కేంద్రాల్లో పటిష్ట ఏర్పాట్లు 10లో



వైజాగ్ చేరుకున్న రామ్‌చరణ్

గోపాలపట్నం: గేమ్ ఛేంజర్ సినిమా షూటింగ్ కోసం రామ్‌చరణ్ గురువారం రాత్రి విమానంలో విశాఖ చేరుకున్నారు. 10లో

న్యూస్‌రీల్

డయల్ యువర్ కలెక్టర్‌కు 27 వినతులు



ఓటర్ల సమస్యలు తెలుసుకుంటున్న డీఆర్వో మోహన్‌కుమార్

మహారాణిపేట: డయల్ యువర్ కలెక్టర్–ఓటర్ హెల్ప్‌లైన్ కార్యక్రమం రెండో రోజూ విజయవంతంగా కొనసాగింది. కలెక్టర్ కార్యాలయం ఆవరణలోని ఎస్‌ఐసీ కేంద్రంలో గురువారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన 27 మంది ఓటర్లు పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. 26 మంది ఓటరు నమోదు, ఎపిక్ కార్డు పొందడం, చిరునామా మార్పు, పోలింగ్ స్టేషన్ వివరాలు, ఆన్‌లైన్‌లో ఓటు కనిపించడం లేదని, పోలింగ్ కేంద్రం మార్పు తదితర అంశాలపై ఫోన్లు చేశారు. ఒకరు మాత్రం ఉపాధి కోరుతూ ఫోన్ చేశారు. ఓటర్ల నుంచి డీఆర్వో కె.మోహన్‌కుమార్, కలెక్టరేట్ ఏవో బీఎస్ దేవ్‌ప్రసాద్ వినతులు స్వీకరించారు. ఈ వివరాలను కలెక్టర్ మల్లికార్జున దృష్టిలో పెట్టారు. పూర్తిస్థాయి విచారణ జరిపి ఈ వినతులకు సకాలంలో పరిష్కరించాలని ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కూడా డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం కొనసాగుతుంది. మధ్యాహ్నం 12.30 నుంచి 1.30 గంటల మధ్యలో 0891–2590100కు ఫోన్ చేసి.. ఓటుకు సంబంధించి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లవచ్చు.

ఫైర్ సేఫ్టీ తప్పనిసరి



దాబాగార్డెన్స్: జీవీఎంసీ పరిధిలోని అన్ని వాణిజ్య సముదాయాలు, పరిశ్రమలు, హోటల్స్, ఆస్పత్రులు, సినిమా థియేటర్లు, విద్యా సంస్థలు, కల్యాణ మండపాలు, కన్వెన్షన్స్, బహుళ అంతస్తుల అపార్టుమెంట్లలో ఫైర్ సేఫ్టీ తప్పనిసరిగా ఉండాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ గురువారం పేర్కొన్నారు. అగ్నిమాపక పరికరాలను నిర్వహించడానికి శిక్షణ పొందినవాళ్లను నియమించుకోవాలన్నారు. రాష్ట్ర అగ్నిమాపక శాఖ, జీవీఎంసీ అగ్నిమాపక నిరోధక విభాగం నుంచి ఎన్‌వోసీ ఉండాలని, ప్రతి మూడు నెలలకోసారి మాక్ డ్రిల్స్ విధిగా నిర్వహించాలని కమిషనర్ సూచించారు. గురువారం నుంచి నవంబర్ వరకు ఫైర్ సేఫ్టీ తనిఖీలు నిర్వహించనున్నామన్నారు. ఫైర్ సేఫ్టీ కోసం జీవీఎంసీ రీజినల్ ఫైర్ ఆఫీసర్ వై.హనుమంతరావును 9989961135 నంబరులో సంప్రదించాలని కమిషనర్ సూచించారు.

జాతీయ లోక్ అదాలత్ రేపు

మహారాణిపేట: జిల్లాలోని అన్ని న్యాయ స్థానాల్లో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్టు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎం.వి.శేషమ్మ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని న్యాయ స్థానాల్లో పెండింగ్ కేసులు, సివిల్, చెక్ బౌన్స్, బ్యాంకింగ్, మోటార్ ప్రమాదాల నష్ట పరిహారాల కేసులు, సెక్షన్ 138 నెగోషియబుల్ ఇనుస్ట్రుమెంట్ చట్టం కేసులు, ఆర్థిక లావాదేవీలు, భూ వ్యవహారాలకు సంబంధించిన కేసులు, కుటుంబ తాగాదాలు, కార్మిక, పారిశ్రామిక వివాద కేసులు లోక్ అదాలత్‌లో పరిష్కరించనున్నట్టు పేర్కొన్నారు. ఇతర వివరాలకు జిల్లా కోర్టు ప్రాంగణంలోని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో లేదా 0891 - 2560414, 2575046 నంబర్లలో, vskpdlsa@yahoo.com, dlsa.vsp@gmail.comలను సంప్రదించవచ్చని ఆమె కోరారు.

'ఆడుదాం ఆంధ్రా' ప్రోత్సాహకం రూ.10 లక్షల అందజేత



సంధ్యకు చెక్కు అందిస్తున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

విశాఖ స్పోర్ట్స్: గ్రామీణ ప్రాంతాల్లోని ఆణిముత్యాలను వెలికితీస్తూ.. ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో భాగంగా నిర్వహించిన 'ఆడుదాం ఆంధ్రా'లో ప్రతిభ చూపిన సంధ్య.. ప్రోత్సాహకంగా రూ.10 లక్షల చెక్కును అందుకుంది. మహిళల కబడ్డీలో లాసన్స్‌బే కాలనీ సచివాలయం జట్టు తరఫున రాష్ట్రస్థాయిలో సత్తాచాటి ఆ ప్రోత్సాహానికి ఆమె ఎంపికైంది. ఆడుదాం ఆంధ్రాలో భాగంగా ఐదు క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించి 15 మందిని టాలెంట్ హంట్ పేరిట ఎంపిక చేశారు. ఇందులో భాగంగా విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ గురువారం సంధ్యకు రూ.10 లక్షల చెక్కును అందజేశారు.

టీడీపీలో సెగలు

- సీటు రాకపోవడంపై సీనియర్లు గరం గరం
- భోరుమంటున్న బండారు, ఇంటికే పరిమితం
- రాజీనామా చేస్తున్నట్టు గండి బాబ్జీ లీకులు
- భవిష్యత్ కార్యాచరణపై అనుచరులతో సమావేశమైన గంటా
- మాడుగులలో పి.వి.జి.కుమార్, గవిరెడ్డి మండిపాటు
- ఎన్నికల బరిలో ఉంటానంటున్న ప్రగడ
- ముఖం చాటేస్తున్న అనకాపల్లి టీడీపీ నేతలు
- నేడు బలప్రదర్శనకు గిడ్డి ఈశ్వరి సన్నాహాలు

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

టికెట్ల ప్రకటనపై టీడీపీలో నిరసన సెగలు ఎగసిపడుతున్నాయి. అసంతృప్త నేతలు తిరుగుబావుటా ఎగురవేస్తున్నారు. అధినేత తీరుపై ధ్వజమెత్తుతున్నారు. చంద్రబాబు తమను నమ్మించి గొంతుకోశారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పొత్తు నేపథ్యంలో పార్టీ కోసం మొదటి నుంచి కష్టపడిన తమను కాదని ఆ సీట్లను బీజేపీ, జనసేనకు కేటాయించడంపై పార్టీ నేతలు ప్రశ్నిస్తున్నారు. విశాఖ దక్షిణం, ఉత్తరం, పెందుర్తి, యలమంచిలి, అనకాపల్లి, పాడేరు నియోజకవర్గాల్లోని టీడీపీ నేతలు అధినేత చంద్రబాబు వ్యవహారశైలిపై మండిపడుతున్నారు. కేవలం ఉమ్మడి విశాఖ జిల్లా నుంచే ఏకంగా పొత్తులో ఆరు సీట్లను కేటాయించడం ఏమిటని వాపోతున్నారు. పార్టీ అధినేత వ్యవహారశైలిపై బండారు భోరుమంటుండగా... బాబ్జీ తన **సీటుకు 'గండి'పడటంపై మండిపడుతున్నారు. ఏకంగా పార్టీకి రాజీనామా చేస్తున్నారనే వదంతులు వెలువడ్డాయి. ఇక గంటాకు భీమిలి ఇచ్చేది లేదు.. చీపురుపల్లి వెళ్లాలని హుకుం జారీ చేయడంతో.. తన సీటు కోసం చంద్రబాబు మెడలో గంట కట్టేందుకు నారాయణ....నారాయణ అని తిరుగుతున్నారు. తాజాగా** తన అనుచరులతో భవిష్యత్ కార్యాచరణపై గంటా భేటీ అయ్యారు. అవకాశం ఉంటే భీమిలి నుంచి పోటీ చేయాలని, లేదంటే ఈ ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉండాలని సన్నిహితులు సూచించినట్టు సమాచారం. ఇక యలమంచిలిలో ఇప్పటికే పార్టీ కార్యాలయంలో ఫర్నీచర్ విరిగిపోగా.. అనకాపల్లిలో లోలోపల అగ్గి రాజుకుంటోంది. మరోవైపు ఏజెన్సీలోని పాడేరు నియోజకవర్గాన్ని బీజేపీకి ఇవ్వడం ఏమిటన్న ప్రశ్నలు వస్తున్నాయి. మొత్తంగా తెలుగుదేశం పార్టీని విశాఖ ఉక్కిరిబిక్కిరి చేస్తోంది.



నమ్ముకుంటే నట్టేట ముంచారు...!

వాస్తవానికి గత ఎన్నికల్లో నగరంలో నాలుగు సీట్లనూ తెలుగుదేశం పార్టీ గెలుపొందింది. ఇప్పుడు పొత్తులో భాగంగా ఇందులో రెండు సీట్లను జనసేన, బీజేపీకి కేటాయించారు. పార్టీకి దక్షిణ నియోజకవర్గంలో ఎవరూ దిక్కు లేని సమయంలో తనకు పగ్గాలు అప్పగించి.. తీరా ఎన్నికల ముందు జనసేనకు ఇవ్వడాన్ని గండి బాబ్జీ జీర్ణించుకోలేకపోతున్నారు. ఇక విశాఖ ఉత్తరాన్ని గతంలో ఎమ్మెల్యేగా ఉన్న విష్ణుకుమార్‌రాజు పార్టీ నేతలను ఇబ్బంది పెట్టిన విషయాన్ని పదే పదే గుర్తుచేసినా.. తిరిగి ఆయనకే సీటు ఇవ్వడం ఏమిటని టీడీపీ నేతలు మండిపడుతున్నారు. ఇక పెందుర్తిలో సీనియర్ నేత బండారు సత్యనారాయణను కనీసం పట్టించుకోకపోవడాన్ని ఆయన వర్గీయులు తప్పుపడుతున్నారు. మొదటి నుంచీ పార్టీలో ఉన్న సీనియర్ నేతను గౌరవించే పద్ధతి ఇదేనా అని వాపోతున్నారు. యలమంచిలిలో పార్టీ జెండాను ఎవరూ మోసేందుకు సిద్ధంగా లేని పరిస్థితుల్లో అండగా ఉన్న ప్రగడ నాగేశ్వరరావును కనీసం సంప్రదించకుండా జనసేనకు సీటును కేటాయించారు. అనకాపల్లిలో గ్రామగ్రామాన పార్టీ కార్యక్రమాలను నిర్వహించిన పీలా గోవింద్‌ను కనీసం పట్టించుకోలేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. పాడేరులోనూ గిడ్డి ఈశ్వరి.... పార్టీ మారివచ్చినందుకు తనకు మంచిగా గడ్డి పెడుతున్నారని వాపోతున్నారు. ఇలా నేతలందరూ పార్టీని నమ్ముకుంటే చంద్రబాబు నట్టేట ముంచారని వాపోతున్నారు.

అన్ని చోట్లా అదే తీరు..!

- తెలుగుదేశం పార్టీలో కష్టపడిన వారిని, నమ్ముకున్న వారిని నట్టేట ముంచారంటూ చంద్రబాబు వైఖరిపై మండిపడుతున్నారు.
- ఇప్పటికే గండి బాబ్జీ రాజీనామా అస్త్రాన్ని ఎక్కుపెట్టినట్టు తెలుస్తోంది. తనకు ఎక్కడో ఒక చోట సీటు ఇవ్వకపోతే తెలుగుదేశం పార్టీలో కొనసాగేదిలేదని ఆయన అనుచరులతో స్పష్టం చేసినట్టు సమాచారం.
- గంటా శ్రీనివాసరావు కూడా తన అనుచరులతో సమావేశమై... భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. చీపురుపల్లి నుంచి పోటీ చేసేదిలేదని... భీమిలి ఇస్తే ఓకే లేదంటే ఏమి చేద్దామనే అంశంపై అనుచరుల అభిప్రాయాలను సేకరించినట్టు తెలుస్తోంది.
- విశాఖ ఉత్తరంలో బీజేపీ నుంచి పోటీ చేయనున్న విష్ణుకుమార్‌రాజుకు టీడీపీ కేడర్ ఎక్కడా సహకరించడం లేదు.
- పెందుర్తిలో బండారు తాడోపేడో తేల్చుకునేందుకు సిద్ధమవుతున్నారు. ఇంటిపట్టునే ఉండి కనీసం బయటకు వచ్చి మోహం చూపించేందుకు కూడా ఆయన ఇష్టపడలేనంతగా లోలోపల రగిలిపోతున్నట్టు తెలుస్తోంది.
- యలమంచిలిలో జనసేన నుంచి పోటీలో ఉండనున్న సుందరపు విజయకుమార్ టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ప్రగడ నాగేశ్వరరావును కలవగా.. మద్దతిచ్చేది లేదని, తానూ బరిలో ఉంటానని స్పష్టం చేసినట్టు తెలుస్తోంది.
- అనకాపల్లిలో కొణతాలపై లోలోపల కత్తులు నూరుతున్నారు. పీలా వర్గీయులతో పాటు దాడి వర్గీయులు కూడా కొణతాలకు సహకరించేది లేదని పేర్కొంటున్నారు.
- మాడుగుల టీడీపీ ఇన్‌చార్జి పి.వి.జి.కుమార్ కె.కోటపాడులో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమై అసంతృప్తిని వ్యక్తం చేశారు. తనకు సీటు రాకపోవడంపై మండిపడ్డారు. మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు చీడికాడలో పార్టీ నేతలతో సమావేశమై ఇన్నాళ్లు పార్టీ కోసం కష్టపడితే అధినేత భలే బుద్ధిచెప్పారని వాపోయారు.
- ఇలా అన్ని నియోజకవర్గాల్లోనూ గతంలో ఎన్నడూ లేని విధంగా టీడీపీలో అసంతృప్తి సెగలు కమ్ముకుంటున్నాయి. రానున్న రోజుల్లో ఎండవేడిమికి మించి ఈ సెగలు పెరిగి.. పార్టీలో అగ్గిరాజేసి విజయావకాశాలను నిలువునా కాల్చేసే పరిస్థితులున్నాయని ఆ పార్టీ నేతలే వ్యాఖ్యానిస్తున్నారు.

బండారుకే టికెట్ కేటాయించాలి

- లేకపోతే రాజీనామా చేస్తాం..
- హెచ్చరించిన టీడీపీ నాయకులు



బండారు ఇంటి ముందు నిరసన తెలుపుతున్న కార్యకర్తలు

పరవాడ : పెందుర్తి మాజీ ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తికి టీడీపీ టికెట్ కేటాయించకపోవడంపై ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. పెందుర్తి నియోజకవర్గంలో సబ్బవరం, పెందుర్తి, పరవాడ మండలాల నుంచి ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావడంతో వెన్నలపాలెంలో బండారు ఇంటి వద్ద గురువారం తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. నాలుగు పర్యాయాలు ఎమ్మెల్యే, ఓ పర్యాయం మంత్రి పదవులు నిర్వహించిన సీనియర్ నాయకుడు బండారుకు సీటు కేటాయించకపోవడం అన్యాయమని పరవాడ జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పైల జగన్నాథరావు, మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు, పలువురు సీనియర్ నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. కష్టకాలంలో ఉన్నప్పుడు పార్టీ కోసం పనిచేసిన బండారును అధిష్టానం గుర్తించకపోవడం దురదృష్టకరమన్నారు. పొత్తులో భాగంగా పెందుర్తి సీటును జనసేనకు కేటాయించడం అన్యాయమని మండిపడ్డారు. అధిష్టానం పునరాలోచించని పక్షంలో సర్పంచులు, ఎంపీటీసీలు పార్టీ పదవులు, సభ్యత్వాలకు రాజీనామాలు చేస్తామని స్పష్టం చేశారు. అధిష్టానం నిర్ణయం తీసుకునే ముందు నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని టీడీపీ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు మడక పార్వతి అన్నారు. పెందుర్తి టీడీపీ టికెట్ బండారుకు కేటాయించపోతే ఉమ్మడి అభ్యర్థి కోసం పనిచేయమని, మూకుమ్మడిగా పార్టీకి రాజీనామాలు చేస్తామని హెచ్చరించారు.

8,302 మందికి వైఎస్సార్ ఈబీసీ నేస్తం



లబ్ధిదారులకు నమూనా చెక్కు అందజేస్తున్న జేసీ మయూర్ అశోక్, బీసీ కార్పొరేషన్ ఈడీ ప్రసాద్

రూ.12.45 కోట్ల చెక్కును అందజేసిన జేసీ మయూర్ అశోక్

మహారాణిపేట: వైఎస్సార్ ఈబీసీ నేస్తం పథకం కింద జిల్లాలోని 8,302 మంది అగ్రవర్ణాలకు చెందిన పేద మహిళల ఖాతాల్లో రూ.12.45 కోట్లను జమ చేసినట్లు జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ తెలిపారు. వైఎస్సార్ ఈబీసీ నేస్తం మూడవ విడత నిధులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం నంద్యాల జిల్లా బనగానపల్లె నుంచి బటన్ నొక్కి ఒక్కొక్కరికి రూ.15,000 చొప్పున రాష్ట్ర వ్యాప్తంగా రూ.629.37 కోట్లను విడుదల చేశారు. స్థానిక కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరం నుంచి జేసీ, బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆర్.ప్రసాద్, ఇతర అధికారులు వర్చువల్‌గా ఈ కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. ముఖ్యమంత్రి ప్రసంగం అనంతరం జిల్లాలో అర్హులైన 8,302 మందికి రూ.12,45,30,000 విలువ గల మెగా చెక్కును జేసీ లబ్ధిదారులకు అందించారు. వైఎస్సార్ ఈబీసీ నేస్తం పథకం ద్వారా జిల్లాలోని 45 నుంచి 60 ఏళ్లలోపు రెడ్డి, కమ్మ, ఆర్యవైశ్య, బ్రాహ్మణ, క్షత్రియ, వెలమలతో పాటు ఇతర ఓసీ వర్గాలకు చెందిన పేద మహిళలకు ఏటా రూ.15 వేలు చొప్పున సాయం అందిస్తున్నట్లు చెప్పారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు మంజూరు

విద్యార్థుల తల్లుల ఖాతాల్లో డబ్బులు జమ

విశాఖ విద్య: డిగ్రీ, డిప్లమో, ఇతర ఉన్నత విద్యా కోర్సులు చదువుతున్న విద్యార్థులకు 2019–20 సంవత్సరంలో పెండింగ్‌లో ఉన్న జగనన్న విద్యా దీవెన(ఫీజు రీయింబర్స్‌మెంట్) నిధులు గురువారం మంజూరయ్యాయి. వీటిని విద్యార్థుల తల్లి బ్యాంకు ఖాతాలో జమ చేసినట్లు సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కె.రామారావు తెలిపారు. కోవిడ్ విపత్కర పరిస్థితులు ఎదురైనప్పటికీ.. పేద విద్యార్థులకు మేలు చేయాలనే సంకల్పంతో 2019–20 విద్యా సంవత్సరానికి 2022 డిసెంబర్ 28న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి విద్యా దీవెన నిధులు విడుదల చేశారు. అయితే అనివార్య కారణాలతో కొంతమంది తల్లుల బ్యాంకు ఖాతాల్లో ఆ డబ్బులు జమ కాలేదు. విద్యార్థులు, అదే విధంగా కాలేజీల నిర్వాహకులకు భారం కాకూడదనే సదుద్దేశంతో ముఖ్యమంత్రి పెండింగ్ జేవీడీ నిధులు విడుదలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. దీంతో గురువారం విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాల్లో ఆ డబ్బులు జమ అయ్యాయి. సచివాలయ వెల్ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు దీనిపై దృష్టి సారించి.. ఫీజులను కళాశాలలకు చెల్లించేలా తగిన చర్యలు తీసుకోవాలని డీడీ ఆదేశించారు. ఇప్పటికే కాలేజీలకు ఫీజు చెల్లించినట్లైతే, దానికి సంబంధించిన రసీదును నవశకం పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. సచివాలయ స్థాయిలో సమగ్ర పరిశీలన చేసి, తగిన నివేదికను ఉన్నతాధికారులకు అందజేయాలన్నారు.

మత్స్యశాఖ జేడీ లాల్‌పై చర్యలు

- జాయింట్ డైరెక్టర్ బాధ్యతల నుంచి తప్పించిన మత్స్యశాఖ
- ఇన్‌చార్జి జేడీగా విజయకృష్ణ

మహారాణిపేట: లైంగిక వేధింపుల కేసు ఎదుర్కొంటున్న ఫిషరీస్ జాయింట్ డైరెక్టర్ ఎస్.కె.లాల్ మహమ్మద్‌పై మత్స్యశాఖ చర్యలకు ఉపక్రమించింది. జాయింట్ డైరెక్టర్ బాధ్యతల నుంచి తప్పించింది. అతని స్థానంలో పూర్తి అదనపు బాధ్యతల(ఎఫ్ఏసీ)తో మత్స్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.విజయ కృష్ణను నియమించింది. ఈ మేరకు మత్స్యశాఖ కమిషనర్ ఎ.సూర్యకుమారి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. మత్స్యశాఖ కార్యాలయంలో మహిళా ఉద్యోగితో జేడీ లాల్ మహమ్మద్ అసభ్యకరంగా ప్రవర్తించారు. దీనిపై ఆమె ఒకటో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ క్రమంలో మత్స్యశాఖ ఉన్నతాధికారులు జేడీపై శాఖాపరమైన చర్యలు తీసుకున్నారు.

విశాఖ అభివృద్ధిలో భాగస్వాములవుదాం

రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ



మాట్లాడుతున్న మంత్రి బొత్స సత్యనారాయణ

ఏయూక్యాంపస్: రాష్ట్రానికి ఒక సంపదగా విశాఖ నగరాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి చేస్తున్నారని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో గురువారం నిర్వహించిన నాక్ విజయోత్సవ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఏయూ నాక్ డబుల్ ప్లస్‌తో 3.74 సీజీపీఏ సాధించిన సర్టిఫికెట్లను ప్రిన్సిపాళ్లకు ప్రదానం చేశారు. ఏయూ సాధించిన గ్రీన్ యూనివర్సిటీ అవార్డును వీసీ ప్రసాదరెడ్డికి అందించారు. అనంతరం మంత్రి బొత్స మాట్లాడుతూ ఇటీవల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశాఖ అభివృద్ధికి తన విజన్‌ను వివరించారన్నారు. ఏయూ ఆచార్యులు, నిపుణులు విభిన్న రంగాలను దృష్టిలో ఉంచుకుని తగిన సూచనలు చేయాలని, ఓ విజన్ డాక్యుమెంట్‌ను రూపొందించి వర్సిటీ తరఫున ప్రభుత్వానికి అందజేయాలన్నారు. అమరావతి నిర్మాణానికి లక్షల కోట్లు అవసరమని.. విశాఖను రాజధానిగా తీర్చిదిద్దడానికి చాలా తక్కువ ఖర్చు అవుతుందన్నారు.

విద్యారంగానికి రూ.75 వేల కోట్లు

ఐదేళ్లలో విద్యారంగానికి రూ.75వేల కోట్లు ఖర్చు చేశామని.. దీనిని విద్యారంగంలో పెట్టుబడిగా సీఎం జగన్ భావిస్తారన్నారు. మానవ వనరుల అభివృద్ధితో రాష్ట్ర ప్రగతి సాధ్యమని ముఖ్యమంత్రి భావిస్తూ ప్రోత్సహిస్తున్నారన్నారు. ఎడ్ ఎక్స్ కోర్సుల్లో ఇప్పటికే 4 లక్షల మంది నమోదు చేసుకున్నారని, దీని వల్ల విదేశీ విశ్వవిద్యాలయాలు అందించే కోర్సులను మన రాష్ట్ర విద్యార్థులు చదివే అవకాశం కలుగుతుందన్నారు. దీనికి అవసరమైన ఖర్చును పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందని, ఈ నిర్ణయం విన్నప్పుడు తాము కూడా ఆశ్చర్యపోయామన్నారు. ప్రతీ అంశాన్ని రాజకీయ కోణంతో చూడటం, బురదజల్లడం ఇటీవల కాలంలో పరిపాటిగా మారిపోయిందన్నారు. రాజకీయాల కోసం ముఖ్యమంత్రి ఏనాడు ఏ పనీ చేయరన్నారు. అంతర్జాతీయ నగరంగా, దేశంలోని అగ్రగామి నగరాల్లో ఒకటిగా విశాఖను తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి భావిస్తున్నారన్నారు. ఈ ప్రాంతవాసులుగా ముఖ్యమంత్రికి సహకారం అందిస్తూ.. నగర అభివృద్ధిలో ప్రతీ వ్యక్తి భాగం కావాలన్నారు. అనంతరం విజన్ వైజాగ్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి మాట్లాడుతూ నాక్‌లో ఏయూ అత్యుత్తమ స్థానం సాధించడానికి వర్సిటీ ఆచార్యులు, ఉద్యోగులు ఓ కుటుంబంలా పనిచేశారన్నారు. ఏయూకు ఇటీవల గ్రీన్ యూనివర్సిటీ అవార్డు లభించిందన్నారు. 2025 నాటికి 500 అంకుర సంస్థలతో ఐదువేల మందికి ఉపాధి కల్పన లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. విశాఖ నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలనే బలమైన సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, ప్రిన్సిపాళ్లు, ఆచార్యులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రారంభం



రెడ్డిపల్లిలో జూనియర్ కళాశాల ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి

పద్మనాభం: సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి విద్యా రంగానికి పెద్ద పీట వేశారని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని రెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ప్లస్ టూ ఇంటర్మీడియట్ (ప్రభుత్వ జూనియర్) కళాశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 210 ప్రభుత్వ జూనియర్ కళాశాలలను తమ ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. వీటిలో రెడ్డిపల్లికి ఒకటి మంజూరు చేశారన్నారు. జూన్‌లో వీటిని ప్రభుత్వం మంజూరు చేయాలనుకుందన్నారు. రెడ్డిపల్లికి తక్షణమే జూనియర్ కళాశాలను మంజూరు చేయాలని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణను తాను కోరగా... రెడ్డిపల్లితోపాటు మిగతా చోట్ల కళాశాలలు మంజూరు చేశారన్నారు. పద్మనాభం మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల లేనందున విద్యార్థులు దూర ప్రాంతాలకు వెళ్లి చదువుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఇంటర్ చదువుకోవడానికి ఇక నుంచి దూర ప్రాంతాలకు వెళ్లకుండా రెడ్డిపల్లి జూనియర్ కళాశాలలో చదువుకోవచ్చన్నారు. జెడ్పీ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు మాట్లాడుతూ ఉమ్మడి విశాఖ జిల్లాలో వడ్డాది తర్వాత రెడ్డిపల్లి హైస్కూల్ పురాతనమైందన్నారు. ఈ పురాతన హైస్కూల్‌ను గత టీడీపీ ప్రభుత్వం జూనియర్ కళాశాలగా మార్చలేదని విమర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, వైస్ ఎంపీపీ ఈర్ల రాజేశ్వరి, ఎంపీడీవో బి.శైలజ, తహసీల్దార్ ఎస్.వెంకటరావు, ఎంఈవో ఎం.రమణ, శేరిఖండం సర్పంచ్ పల్లంటి చిన్నారావు, వైఎస్సార్ సీపీ నాయకుడు ఈర్ల ఈశ్వరరావు, హెచ్‌ఎం ఎం.సన్యాసిరావు పాల్గొన్నారు.

స్పా కేంద్రాల ముసుగులో వ్యభిచారం

- పోలీసుల ఆకస్మిక తనిఖీల్లో నిర్ధారణ
- నాలుగు స్పా కేంద్రాలపై కేసుల నమోదు
- స్వధార్ హోంకు 17 మంది యువతుల అప్పగింత
- నిర్వాహకులతో పాటు ఏడుగురు విటుల అరెస్ట్

విశాఖ సిటీ: స్పా కేంద్రాలు వ్యభిచార కూపాలుగా మారిపోయాయి. మసాజ్ ముసుగులో దేశ, విదేశీ యువతులతో ఇక్కడ అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయి. పోలీసుల ఆకస్మిక తనిఖీలతో స్పా నిర్వాహకుల బాగోతం బట్టబయలైంది. నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ ఆదేశాలతో నగరంలోని 64 స్పా, మసాజ్ కేంద్రాలపై బుధవారం రాత్రి ఆకస్మిక దాడులు చేశారు. సుమారు 200 మంది అధికారులు, సిబ్బందితో నిర్వహించిన ఈ తనిఖీల్లో నాలుగు కేంద్రాల్లో వ్యభిచారం జరుగుతున్నట్లు పోలీసులు గుర్తించారు. వాటి నిర్వాహకులపై కేసులు నమోదు చేశారు. అలాగే ఏడుగురు విటులను అరెస్టు చేశారు. ఇందులో పీసీఆర్ ఎస్ఐ కూడా ఉండడం గమనార్హం. అతడిని కూడా అదుపులోకి తీసుకుని కేసు పెట్టారు.

స్పా కేంద్రాలపై ఫిర్యాదులు

నగరంలో పలు స్పా కేంద్రాలపై ఎప్పటికప్పుడు ఫిర్యాదులు వస్తూనే ఉన్నాయి. నిబంధనలకు విరుద్ధంగా క్రాస్ మసాజ్‌లు, అదనపు చార్జీలతో ప్రత్యేక సర్వీసులతో విటులను నిర్వాహకులు ఆకర్షిస్తున్నారు. దేశంలో ఈశాన్య రాష్ట్రాల నుంచే కాకుండా విదేశీ యువతులను తీసుకువచ్చి ఈ అక్రమ వ్యాపారాన్ని తెరతీస్తున్నారు. వీటిపై ఎన్ని ఫిర్యాదులు వచ్చినా తనిఖీల సమయంలో జరిమానాలు, చిన్నచిన్న కేసులతో బయటపడుతున్నారు. కానీ అసాంఘిక కార్యక్రమాలను మాత్రం ఆపడం లేదు. రెండు నెలల కిందట పోలీస్ అధికారులు స్పా కేంద్రాలపై దాడులు చేసి నిర్వాహకులకు గట్టిగా వార్నింగ్ ఇచ్చారు. అయినప్పటికీ వారిలో ఎటువంటి మార్పు లేదని తాజా వ్యవహారంతో స్పష్టమవుతోంది.

స్పా కేంద్రంలో ఎస్ఐ.. కేసు నమోదు

స్పా కేంద్రాల్లో పోలీస్ అధికారులు ఏకకాలంలో చేసిన తనిఖీల్లో కంచరపాలెం పోలీస్‌స్టేషన్ పరిధి బిర్లా జంక్షన్ వద్ద ఉన్న స్పా సెంటర్‌లో పీసీఆర్ ఎస్ఐ ఉమాశంకర్ పట్టుబడ్డాడు. దీంతో నిర్వాహకుడు పాల్ డేవిడ్‌రాజ్‌తో పాటు విటుడు ఎస్ఐపై కూడా కేసు నమోదు చేశారు. అలాగే గాజువాక, దువ్వాడ, న్యూపోర్ట్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో మరో మూడు స్పాలలో ఇదే తరహాలో అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నట్లు పోలీసులు గుర్తించారు. వీటిలో ఉన్న ఈశాన్య రాష్ట్రాలకు చెందిన 17 మంది యువతులను స్వధార్ హోంకు అప్పగించారు. ఏడుగురు విటులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

జోన్–1లో తనిఖీల సమాచారం లీక్!

విశాఖ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 22 పోలీస్‌స్టేషన్ల పరిధిలో స్పా కేంద్రాలపై పోలీసులు ఆకస్మిక దాడులు చేశారు. ఇందులో జోన్–2 పరిధిలో నాలుగు కేంద్రాల్లో వ్యభిచారం చేస్తున్నట్లు గుర్తించారు. ఇదిలా ఉంటే జోన్–1 పరిధిలోని ఒక్క స్పా సెంటర్‌పై కూడా కేసు నమోదు చేయలేదు. దీనిపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వాస్తవానికి జోన్–2 కంటే జోన్–1 పరిధిలోనే 80 శాతం స్పా కేంద్రాలు ఉన్నాయి. ముఖ్యంగా త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోనే 50 శాతానికి పైగా స్పా, మసాజ్ సెంటర్లు సర్వీసులు అందిస్తున్నాయి. వీటిలో ఒక్క కేంద్రంలో ఎటువంటి ఆధారాలు లభించకపోవడంపై ఉన్నతాధికారులు సైతం విస్మయం వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి ఈ తనిఖీల సమాచారం స్పా కేంద్రాల నిర్వాహకులకు ముందే లీక్ అయినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై సీపీ రవిశంకర్ కూడా సీరియస్ అయినట్లు సమాచారం. ఈ వ్యవహారంపై విచారణకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. మరోసారి ఈ స్పా కేంద్రాలపై ఆకస్మిక దాడులు నిర్వహించే ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది.

ముగిసిన ఇంటర్ ఫస్టియర్ పరీక్షలు


ఆనందంలో విద్యార్థులు

విశాఖ విద్య: ఇంటర్మీడియట్ ఫస్టియర్ పరీక్షలు గురువారంతో ముగిసాయి. ఈ నెల ఒకటో తేదీ నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభం కాగా.. జనరల్ కోర్సులకు సంబంధించి మొదటి సంవత్సరం పరీక్షలు పూర్తయ్యాయి. పరీక్షలను విజయవంతంగా ఎదుర్కొన్న విద్యార్థులు మొత్తం సబ్జెక్టుల ఫలితాలపై బేరీజు వేసుకున్నారు. ఇదే విషయాన్ని తోటి స్నేహితుల వద్ద చర్చించుకోవడం కనిపించింది. విద్యార్థులు ఒకరికొకరు అభినందనలు తెలుపుకుని ఇంటిదారి పట్టారు. కాగా 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి 40,874 మంది ఫస్టియర్ విద్యార్థులు పరీక్షలకు నమోదు చేసుకున్నారు. ఒకేషనల్ కోర్సు విద్యార్థులకు కూడా సబ్జెక్టులన్నీ పూర్తయిన తర్వాత వీరిలో ఎంతమంది విద్యార్థులు గైర్హాజరయ్యారనేది తేలనుంది. ఇదిలా ఉండగా జిల్లాలో మొదటి సంవత్సరం పరీక్షల్లో ఒక్క మాల్ ప్రాక్టీస్ కేసు కూడా నమోదు కాకుండా విజయవంతంగా ముగియడం విశేషం.

రూ.15లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ అందజేత


బాధితుడి తల్లికి రూ.15లక్షల చెక్ అందజేస్తున్న ఆదారి ఆనంద్‌కుమార్, రమాకుమారి

మల్కాపురం : జీవీఎంసీ 59వ వార్డు ప్రాంతానికి చెందిన అల్లబోయిన దినేష్ అనే యువకుడికి గుండెకు సంబంధించిన సమస్య ఏర్పడింది. తల్లి రమణమ్మ చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తీసుకువెళ్తే గుండెకు శస్త్రచికిత్స (గుండె మార్పిడి) జరపాలని, అందుకు సుమారు రూ.కోటి వరకు ఖర్చు అవుతుందని వైద్యులు తెలపడంతో ఆమె ప్రభుత్వ సాయం కోరింది. వైఎస్సార్ సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆదారి ఆనంద్‌కుమార్ చొరవ తీసుకుని సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ.15 లక్షలు మంజూరు చేయించారు. నెహ్రూనగర్‌లో గురువారం జరిగిన ఓ కార్యక్రమంలో బాధితుని తల్లి రమణమ్మకు ఆదారి ఆనంద్‌కుమార్, యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి చేతుల మీదుగా చెక్ అందించారు. దీంతో రమణమ్మ ఆనంద్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపింది.

వైఎస్సార్ సీపీ జిల్లా అనుబంధ కమిటీల నియామకం

సాక్షి, విశాఖపట్నం: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు విశాఖ జిల్లా అనుబంధ కమిటీల్లో పలువురికి చోటు కల్పించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. • పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పచ్చిరాపల్లి రాము(విశాఖ దక్షిణ), కార్యదర్శులుగా పండరంకి అప్పల నాయుడు(విశాఖ ఉత్తర), మోటూరి వీర రాఘవులు(విశాఖ ఉత్తర) నియమితులయ్యారు. • సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షురాలిగా బయ్యవరపు రాధ(విశాఖ ఉత్తర), ప్రధాన కార్యదర్శులుగా సరగడ చిన్నా రెడ్డి(భీమిలి), మామిడి రీనా(విశాఖ ఉత్తర), బంటు కృష్ణమూర్తి(విశాఖ పశ్చిమ), కార్యదర్శులుగా తలడ నరసింహనాయుడు(భీమిలి), పిల్లి దుర్గ(విశాఖ తూర్పు), గుంటు రామాంజనేయులు(విశాఖ తూర్పు), జె.గౌరీశంకరరావు(విశాఖ పశ్చిమ), కట్టంశెట్టి రమణమ్మ(విశాఖ పశ్చిమ), సంయుక్త కార్యదర్శులుగా గాయత్రీ(భీమిలి), పాండ్రంగి గంగరాజు(భీమిలి), ఎన్.శివకుమార్(విశాఖ దక్షిణ), చంద్రాజు స్వర్ణ నాగలక్ష్మి(విశాఖ దక్షిణ), ములమపాక రమణమ్మ(విశాఖ ఉత్తర), గుంటూరు లలితశ్రీ(విశాఖ పశ్చిమ), గురిబిల్లి గురునాథ్‌రెడ్డి(విశాఖ పశ్చిమ), ఉరుకూటి కనకారావు(విశాఖ పశ్చిమ), అంగుటూరి రాజు(విశాఖ పశ్చిమ)లను నియమించారు.

• మహిళా విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శులుగా చేకూరి రజిని(భీమిలి), డాక్టర్ మంచ నాగ మల్లేశ్వరి(విశాఖ ఉత్తర), కార్యదర్శులుగా జి.అరుణశ్రీ(భీమిలి), బూసా రామలక్ష్మి(భీమిలి), సంయుక్త కార్యదర్శిగా షేక్ జహనార్(భీమిలి) నియమితులయ్యారు. • ఎస్సీ విభాగం జిల్లా కార్యదర్శిగా పద్మశేఖర్(విశాఖ ఉత్తర), సంయుక్త కార్యదర్శిగా జి.జగజ్జీవన్‌రావు(విశాఖ ఉత్తర)లను నియమించారు.

• వికలాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడిగా కోరాడ అప్పల స్వామి నాయుడు(భీమిలి), ప్రధాన కార్యదర్శులుగా గండిబోయిన సంజీవ్(భీమిలి), చోడిశెట్టి దుర్గారావు(విశాఖ ఉత్తర), సింగిపల్లి శ్రీనివాసరావు(విశాఖ పశ్చిమ), కార్యదర్శులుగా గోరిబిలి హరిబాబు(భీమిలి), ఆకుల విజయ(విశాఖ ఉత్తర), ఆకుల జయమ్మ(విశాఖ ఉత్తర), సంయుక్త కార్యదర్శులుగా చెట్ల యల్లారెడ్డి(భీమిలి), యర్రా దేముడు(భీమిలి), పిల్లి వెంకట రమణ(విశాఖ ఉత్తర), నీలాపు ఈశ్వరరావు(విశాఖ ఉత్తర) నియమితులయ్యారు.

• సేవాదళ్ విభాగం జిల్లా అధ్యక్షుడిగా దాడి రమేష్(విశాఖ పశ్చిమ), ఉపాధ్యక్షులుగా పాల శ్రీహరిరెడ్డి(విశాఖ దక్షిణ), బియ్య సూరిబాబు(భీమిలి), ప్రధాన కార్యదర్శులుగా పిల్లా అప్పన్న(భీమిలి), గురజాపు రవి(దక్షిణ), గురజాపు అప్పారావు(ఉత్తర), ఎ.సుబ్బారావు(ఉత్తర), కాకి వెంకట రమణ(పశ్చిమ), కార్యదర్శులుగా చిల్లా ఈశ్వరరావు(భీమిలి), బి.శ్రీనివాసరెడ్డి(భీమిలి), కాలిశెట్టి బాలకృష్ణ(విశాఖ దక్షిణ), రాయితీ సతీష్(దక్షిణ), గండిరెడ్డి సన్యాసిరావు(ఉత్తర), గార కృపారావు(ఉత్తర), కాలా రాంబాబు(పశ్చిమ), కొంతం గంగాజీ(పశ్చిమ), సంయుక్త కార్యదర్శులుగా దూడా కొండబాబు(భీమిలి), సుగ్గు విజయకుమార్(దక్షిణ), బీరా అశోక్(దక్షిణ), బోరా రామిరెడ్డి(ఉత్తర), బుడుమూరు తిరుమలరావు(ఉత్తర), గుంటు రవికుమార్(పశ్చిమ), దమ్ము శంకర్(పశ్చిమ), దాడి దేవెంద్ర(పశ్చిమ)లను నియమించారు.

• వైఎస్సార్‌టీయూసీ విభాగం జిల్లా అధ్యక్షుడిగా కలిదిండి బద్రీనాథ్(విశాఖ పశ్చిమ), ప్రధాన కార్యదర్శులుగా మునకాల ఆదినారాయణ(భీమిలి), నిడదవోలు పద్మనాభ రాజు(విశాఖ ఉత్తర), వంజరపు శ్రీనివాస్(విశాఖ పశ్చిమ), వేదలాల శ్రీనివాస్(విశాఖ పశ్చిమ), కార్యదర్శులుగా దాసరి కనకరాజు(భీమిలి), పతువాడ నరసింగరావు(భీమిలి), గాలి ప్రసాద్(విశాఖ ఉత్తర), కె.గురువోజి(విశాఖ ఉత్తర), కర్రి బాబు(విశాఖ పశ్చిమ), వి.నరసింగమూర్తి(విశాఖ పశ్చిమ), సంయుక్త కార్యదర్శులుగా మొగల రమణ(భీమిలి), కోరాడ కృష్ణ(భీమిలి), పోలిశెట్టి అప్పారావు(విశాఖ ఉత్తర), కుచరలపతి కృష్ణరాజు(విశాఖ ఉత్తర), భీశెట్టి భూపతి నాయుడు(విశాఖ పశ్చిమ), పిలక వెకంట రమణ(విశాఖవెస్ట్), శరగడ హరిష్(విశాఖ పశ్చిమ) నియమితులయ్యారు.

• యువజన విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శిగా సమెట్ల వెంకటేష్(విశాఖ ఉత్తర), కార్యదర్శులుగా భీశెట్టి ప్రసాద్(దక్షిణ), యల్లబిల్లి వెంకట నూకరాజు(విశాఖ ఉత్తర), సంయుక్త కార్యదర్శిగా బొట్టు రాజు(విశాఖ ఉత్తర)ను నియమించారు.

వరుణ్ మోటార్స్‌కు జేసీబీ బెస్ట్ డీలర్ అవార్డు


అవార్డు అందుకుంటున్న వరుణ్ ఎండీ వరుణ్‌దేవ్

విశాఖ సిటీ: వరుణ్ మోటార్స్ 2023లో అత్యధిక అమ్మకాలు సాధించినందుకు ప్రతిష్టాత్మకమైన స్పిరిట్ ఆఫ్ జేసీబీ అవార్డు లభించింది. జేసీబీ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఆధ్వర్యంలో నగరంలో ప్రత్యేకంగా నిర్వహించిన కార్యక్రమంలో జేసీబీ ఇండియా ఎండీ అండ్ సీఈఓ దీపక్‌శెట్టి చేతుల మీదుగా వరుణ్ గ్రూప్ ఎండీ వరుణ్‌దేవ్ ఈ అవార్డును అందుకున్నారు. ఈ కార్యక్రమంలో వరుణ్ గ్రూప్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వినోద్‌కుమార్, సీజీఎం వెంకటేష్, వరుణ్, జేసీబీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక రైళ్లు

తాటిచెట్లపాలెం: సంత్రగచ్చి–చెన్నై మధ్య ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు వాల్తేర్ సీనియర్ డీసీఎం ఏకే త్రిపాఠి తెలిపారు. సంత్రగచ్చి–ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ (08836) స్పెషల్ సంత్రగచ్చిలో ఈ నెల 23న సాయంత్రం ఆరు గంటలకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 7 గంటలకు విశాఖ చేరుకుంటుంది. ఇక్కడ నుంచి 7.20 గంటలకు బయలుదేరి అదేరోజు రాత్రి 8.30 గంటలకు చెన్నై సెంట్రల్ వెళ్తుంది. చెన్నై సెంట్రల్– సంత్రగచ్చి(08837) స్పెషల్ చెన్నై సెంట్రల్‌లో 25న ఉదయం 10.45 గంటలకు బయలుదేరి అదే రోజు రాత్రి 11.10 గంటలకు విశాఖ చేరుకుంటుంది. ఇక్కడ నుంచి 11.30 గంటలకు బయలుదేరుతుంది.

రిషభ్ పంత్ .. తీవ్ర కసరత్తు

- ఐపీఎల్‌లో రాణిస్తే జాతీయ జట్టులో అవకాశం


వ్యాయామం చేస్తున్న రిషభ్ పంత్

విశాఖ స్పోర్ట్స్: మోకాలికి తీవ్ర గాయమైతే కోలుకోవడమే కష్టం. అలాంటిది క్రికెట్ ఆడటం అంటే అద్భుతమే. ప్రమాదం నుంచి కోలుకున్న రిషభ్ పంత్ అసాధ్యాన్ని సుసాధ్యం చేస్తూ.. కెరీర్‌లో రెండో ఇన్నింగ్స్‌ను ప్రారంభించాడు. బీసీసీఐ క్లియరెన్స్‌తో విశాఖలో కసరత్తు మొదలుపెట్టాడు. ప్రస్తుత ఐపీఎల్ సీజన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ కీపర్ బ్యాటర్‌గా సత్తా చాటేందుకు వైఎస్సార్ స్టేడియంలో గురువారం కూడా ప్రాక్టీస్ చేశాడు. జూన్‌లో జరిగే టీ–20 ప్రపంచకప్‌కు భారత జట్టులోకి తిరిగి పంత్ రావచ్చని బీసీసీఐ కార్యదర్శి జై షా వెల్లడించడంతో.. ఐపీఎల్‌లో ఎలా రాణిస్తాడనేది అందరిలో ఆసక్తి రేపుతోంది. ప్రస్తుతం విశాఖలో డీసీ జట్టు ప్రీ సెషన్ శిక్షణ శిబిరంలో ఉంది. జట్టుకు మెంటర్‌గా వ్యవహరిస్తున్న సౌరభ్ గంగూలీ గురువారం విశాఖ చేరుకున్నాడు. ఇక్కడే వారం రోజుల పాటు జట్టుతో ఉండి సూచనలు, సలహాలు అందించనున్నారు. ప్రస్తుతానికి వార్నరే జట్టుకు నాయకత్వం వహిస్తున్నా.. పంత్ నాయకత్వ బాధ్యతలు తీసుకునే వీలుంది. జట్టు కోచ్‌గా రికీపాంటింగ్ వ్యవహరిస్తున్నారు. హోం గ్రౌండ్‌గా విశాఖలోని వైఎస్సార్ స్టేడియంలో తొలి మ్యాచ్ ఈ నెల 31న సీఎస్‌కేతో, రెండో మ్యాచ్ ఏప్రిల్ 3న కేకేఆర్‌తో డీసీ తలపడనుంది.

స్ట్రాంగ్ రూం, కౌంటింగ్ కేంద్రాల్లో పటిష్ట ఏర్పాట్లు

ఏయూ ఇంజినీరింగ్ కళాశాల భవనాలను పరిశీలించిన కలెక్టర్

మహారాణిపేట: ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాల్లో పటిష్ట భద్రత ఏర్పాట్లు చేయాలని వివిధ విభాగాల అధికారులను కలెక్టర్ ఎ.మల్లికార్జున ఆదేశించారు. పోలీస్ కమిషనర్ ఎ.రవిశంకర్, జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, డీఆర్వో కె.మోహన్‌కుమార్, ఇతర అధికారులతో కలిసి ఏయూ ఇంజినీరింగ్ కళాశాల పరిధిలోని పలు భవనాలను గురువారం ఆయన పరిశీలించారు. పోలీసు, రెవెన్యూ, ఏయూ ఇంజినీరింగ్ కళాశాల అధికారులతో పలు అంశాలపై చర్చించారు. నోటిఫికేషన్ వచ్చిన అనంతరం ఏయే అవసరాలకు ఎన్ని భవనాలు కావాలో పూర్తి వివరాలతో నివేదిక ఇస్తామని, అందుకనుగుణంగా భవనాలను కేటాయించాల్సి ఉంటుందని ఏయూ అధికారులకు కలెక్టర్ చెప్పారు. స్ట్రాంగ్‌రూమ్, కౌంటింగ్ కేంద్రాల నిమిత్తం అనుకూలమైన భవనాలను గుర్తించిన ఆయన.. అక్కడ చేపట్టాల్సిన చర్యల గురించి రెవెన్యూ అధికారులకు మార్గదర్శకాలు జారీ చేశారు. వాహనాల రాకపోకలు, ఈవీఎంల పంపిణీ తదితర సమయాల్లో ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జాయింట్ సీపీ కె.ఫకీరప్ప, డీసీపీ మణికంఠ, ఆర్డీవోలు హుస్సేన్ సాహెబ్, భాస్కరరెడ్డి, ఏఆర్వోలు అఖిల, శేషశైలజ, మూర్తి, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

155 కిలోల గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం : విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో 155 కిలోల గంజాయిని గవర్నమెంట్ రైల్వే పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. జీఆర్పీ ఎస్ఐ వి.బాలాజీరావు సిబ్బందితో రైల్వేస్టేషన్‌లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆ సమయంలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఖతీవుద్దీన్, మొహమ్మద్ దానిష్‌లబ్యాగులు తనిఖీ చేయగా 155 కేజీల గంజాయి లభ్యమైంది. వెంటనే గంజాయి స్వాధీనం చేసుకుని, నిందితులను రిమాండ్‌కు తరలించారు.

'పది' పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

- జిల్లాలో హాజరుకానున్న 31,379 మంది
- 138 పరీక్ష కేంద్రాల ఏర్పాటు
- డీఈవో చంద్రకళ

విశాఖ విద్య : పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు డీఈవో ఎల్.చంద్రకళ తెలిపారు. డీఈవో కార్యాలయంలోని తన చాంబర్లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె వివరాలు వెల్లడించారు. ఈ నెల 18 నుంచి 30 వరకు రోజూ ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 వరకు పరీక్ష జరుగుతుందన్నారు. జిల్లాలో గుర్తింపు ఉన్న 441 పాఠశాలల నుంచి 31,379 మంది విద్యార్థులు హాజరవుతున్నట్లు తెలిపారు. వీరిలో రెగ్యులర్ విద్యార్థులు 28,367 మంది, ప్రైవేటు విద్యార్థులు 3,012 మంది పరీక్షలు రాస్తున్నారన్నారు. వీరి కోసం జిల్లాలో 138 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. కేంద్రాలను తనిఖీ చేసేందుకు వచ్చే అధికారులు సైతం తమ ఫోన్లను గది వెలుపలే విడిచిపెట్టి లోపలికి వెళ్లాలన్నారు. పేపర్ లీకేజీలకు కారణమైతే.. వారిని ఉద్యోగం నుంచి పూర్తిగా తొలగిస్తామని హెచ్చరించారు.

ఓపెన్ పరీక్షలకు 2,201 మంది

సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో నిర్వహించే టెన్త్, ఇంటర్మీడియట్ పరీక్షలు సైతం ఈ నెల 18 నుంచి ప్రారంభమవుతున్నట్లు డీఈవో చంద్రకళ తెలిపారు. మధ్యాహ్న సమయంలో పరీక్షలు జరుగుతాయన్నారు. పదో తరగతికి 986 మంది విద్యార్థులు హాజరుకానుండగా, వీరి కోసం ఐదు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఇంటర్మీడియట్‌కు 1,215 మంది నమోదు చేసుకోగా, వీరి కోసం 6 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు.

హాల్ టికెట్ ఇవ్వకుంటే గుర్తింపు రద్దు

ఫీజు బకాయి పేరుతో హాల్ టికెట్ ఇవ్వకుండా విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తే, అలాంటి స్కూళ్ల గుర్తింపు రద్దు చేస్తామని డీఈవో చంద్రకళ హెచ్చరించారు. ఈ విషయమై తల్లిదండ్రులు తమకు నేరుగా ఫిర్యాదు చేయవచ్చన్నారు. అయితే స్కూళ్లలో ఇచ్చే వాటితో పనే లేదని, వెబ్‌సైట్ నుంచి నేరుగా హాల్ టికెట్ డౌన్‌లోడ్ చేసుకుని, వాటితో కేంద్రాలకు వెళ్తే పరీక్షలు రాసేందుకు అనుమతించేలా స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామన్నారు.

దివ్యాంగుల పోస్టులకు 29లోగా దరఖాస్తు

మహారాణిపేట : ఉమ్మడి విశాఖ జిల్లాలో వివిధ ప్రభుత్వ శాఖల్లో విభిన్న ప్రతిభావంతులకు (దివ్యాంగులకు) కేటాయించిన 13 బ్యాక్‌లాగ్ ఉద్యోగాలు భర్తీ చేయడానికి కలెక్టర్ ఎ.మల్లికార్జున నోటిఫికేషన్ జారీ చేశారు. అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లా, విశాఖ జిల్లాలో అర్హులైన అభ్యర్థులు ఈ నెల 29లోగా దరఖాస్తు చేసుకోవాలని, పూర్తి చేసిన దరఖాస్తులను పోస్టు ద్వారాగానీ, స్వయంగా గానీ అందజేయాలని తెలియజేశారు. అభ్యర్థులు దరఖాస్తు చేసే సమయానికి 18 ఏళ్లు పైబడి, ఈ ఏడాది జూలై ఒకటి నాటికి 52 ఏళ్లు దాటకూడదన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను రాణి చంద్రమణి దేవి ఆస్పత్రిలో అందజేయాలని, పూర్తి వివరాలు https://visakhapatnam.ap.gov.in/లో చూసుకోవాలని సూచించారు.

చలివేంద్రాలు ఏర్పాటు చేయండి

డాబాగార్డెన్స్: వేసవి దృష్ట్యా నగరంలో చలివేంద్రాలు, షెల్టర్లు ఏర్పాటు చేయాలని జీవీఎంసీ అదనపు కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ అధికారులను ఆదేశించారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం ఉన్నతాధికారులు, జోనల్ కమిషనర్లు, పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. వాతావరణ కేంద్రం హెచ్చరికల నేపథ్యంలో ఈ ఏడాది వేసవిలో ఉష్ణోగ్రతలు అధికంగా ఉంటాయని, ప్రజల సౌకర్యార్థం హైవేపై ప్రతి మూడు కిలోమీటర్లకు, ప్రధాన రహదారుల్లో ప్రతి కిలోమీటర్‌కు చలివేంద్రం ఏర్పాటు చేయాలన్నారు. రైల్వేస్టేషన్లు, బస్ స్టేషన్లు, బస్టాప్‌లు, సంతలు, రైతు బజార్లు, పార్కుల వద్ద చలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. స్వచ్ఛంద సంస్థలు, నివాస సంక్షేమ సంఘాలు స్వచ్ఛందంగా చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారని, వారితో జోనల్ కమిషనర్లు సమన్వయం చేసుకుని తగిన సహకారం అందించాలని ఆదేశించారు. రాబోయే ఎన్నికల దృష్ట్యా చలివేంద్రాల వద్ద ఎటువంటి రాజకీయ ప్రకటనలు, ఫొటోలు, పార్టీ గుర్తులు ఉండరాదని స్పష్టం చేశారు. పక్షులు, జంతువులను రక్షించేందుకు నీటి తొట్టెలు సిద్ధం చేయాలన్నారు. సమావేశంలో ప్రధాన ఇంజినీర్ రవి కృష్ణంరాజు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్, డీడీహెచ్ దామోదరరావు, యూసీడీ ప్రాజెక్టు డైరెక్టర్ పాపునాయుడు, జెడ్సీలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలు తగ్గుముఖం

కలెక్టర్ మల్లికార్జున

మహారాణిపేట: జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎ.మల్లికార్జున అధికారులను ఆదేశించారు. రవాణా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా రోడ్డు భద్రతా కమిటీ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల వల్ల ప్రమాదాల శాతం తగ్గుముఖం పట్టినట్లు తెలిపారు. జిల్లాలో 26 శాతం ప్రమాదాలు, 32 శాతం మరణాలు తగ్గుముఖం పట్టాయన్నారు. తెలుగుతల్లి ఫ్లైఓవర్‌పై వాహనాలు వేగంగా రాకపోకలు సాగిస్తున్నాయని, జీవీఎంసీ, ఆర్టీఏ, పోలీసు అధికారులు తనిఖీలు చేసి డిజైన్ లోపాలను గుర్తించాలని ఆదేశించారు. రద్దీ ప్రాంతాల్లో ప్రైవేట్ స్థలాల్లో వాహనాల పార్కింగ్ కోసం స్థల యాజమానులతో మాట్లాడాలని జీవీఎంసీ కమిషనర్‌కు సూచించారు. మానవ తప్పిదాలతోనే అత్యధిక శాతం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని ఆయన చెప్పారు.సింహాచలంలో బీఆర్టీఎస్ పనుల పురోగతిని తెలుసుకున్నారు. ఇన్సూరెన్స్ లేకపోయినా హిట్- రన్ ప్రమాదాలలో చనిపోయిన వారికి రూ.2 లక్షలు, క్షతగాత్రులకు రూ.50వేలు సంబంధిత ఆర్డీవోలు ద్వారా అందించాలన్నారు. సీతకొండ మలుపు ప్రాంతంలో ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయని వారం రోజుల్లో చర్యలు చేపట్టాలని ఆర్అండ్‌బీ, ఆర్టీఏ ,పోలీస్, వీఎంఆర్డీఏ అధికారులను ఆదేశించారు. జిల్లాలో జరుగుతున్న ప్రమాదాల వివరాలను ఐరాడ్ యాప్‌లో నమోదు చేయాలన్నారు. కూర్మన్నపాలెం నుంచి లంకెలపాలెం వరకు రోడ్డు మధ్యలో గ్రిల్ సరిగా లేనందున ప్రమాదాలు జరుగుతున్నాయని, తక్షణమే గ్రిల్ ఏర్పాటు చేయాలని జీవీఎంసీ అధికారులు ఆదేశించారు. జీవీఎంసీ కమిషనర్ సాయి కాంత్ వర్మ మాట్లాడుతూ హాస్పిటల్స్, స్కూల్ జోన్ ప్రాంతాల్లో ట్రాఫిక్ సైన్ బోర్డ్స్ ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఉప రవాణా కమిషనర్ రాజారత్నం గత సమావేశం నుంచి ఇప్పటి వరకు రహదారి భద్రతకు తీసుకున్న వివరాలను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా కలెక్టర్‌కు వివరించారు.